## స్టాండింగ్ కమిటీ సమావేశం వాయిదా

సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం వచ్చే వారానికి వాయిదా పడింది. గురువారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరగాల్సిన ఈ సమావేశంలో చివరి నిమిషంలో వాయిదా వేశారు. దీంతో 11 అంశాలకు తోడుగా మరిన్ని అంశాలను ఎజెండాలో చేర్చి వచ్చే గురువారం (జూన్ 26) రోజున స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

## అంతర్జాతీయ జర్నల్‌లో పతంజలి పరిశోధన ప్రచురణ

సిటీబ్యూరో, జూన్19, (నమస్తే తెలంగాణ): పతంజలి సంస్థకు చెందిన శాస్త్రవేత్తలు చేసిన పరిశోధన అంతర్జాతీయ విలీ ప్రచురణ జర్నల్ 'సీఎన్ఎస్ న్యూరో సైన్స్ అండ్ థెరఫిటిక్స్'లో ప్రచురించబడింది. సీ ఎలిగాన్స్ అనే సూక్ష్మజీవులపై చేసిన ప్రయోగంలో, ఆయుర్వేద ఔషధం న్యూరోగ్రిట్ గోల్డ్.. పార్కిన్‌సన్ వ్యాధితో వచ్చే జ్ఞాపక నష్టాన్ని తగ్గించడమే కాకుండా జీవనకాలాన్ని కూడా పెంచుతుందని ఈ పరిశోధన స్పష్టం చేసింది. అంతేకాక.. ఈ ఔషధం జీవుల వంశపారంపర్య ప్రగతిని ఆపదు అని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆచార్య బాలకృష్ణ మాట్లాడుతూ.. "పార్కిన్‌సన్ వ్యాధి ఉన్న వారు మానసికంగా బాధపడతారు. అంతేకాక, వారి సామాజిక పరస్పర సంబంధాలు కూడా తగ్గిపోతాయి. కానీ వారు స్వయం సహాయంగా సాధారణ జీవితం కొనసాగించగలరా? అవును, ఇది సాధ్యమే," అని అన్నారు.

## ప్రమాణాల ప్రకారమే రంబుల్ స్ట్రిప్స్

(మొదటిపేజీ తరువాయి)

అధికమవుతాయని వైద్యులు, పౌరుల నుంచి వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. అత్యధికంగా బంజారాహిల్స్ రోడ్ నెంబర్ –3లోని ఓ మసీద్ వద్ద, పంజాగుట్ట నుంచి బేగంపేట వైపు వెళ్లే మార్గంలో, హబ్సిగూడ, మెహిదీపట్నం, నిజాం కాలేజీ హాస్టల్ నుంచి సీసీఎస్, అసెంబ్లీ వద్ద, ఐఎస్‌బీ రోడ్‌లో రంబుల్ స్ట్రిప్స్‌పై అత్యధికంగా ఫిర్యాదులు వచ్చాయి. ఈ క్రమంలోనే. సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు రోజురోజుకు విరుచుపడుతుండడంతో ఎట్టకేలకు జీహెచ్ఎంసీ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. కొత్త రోడ్లపై ఐఆర్‌సీ ప్రమాణాలు పక్కాగా పాటించడంతో పాటు ప్రస్తుతం ఉన్న రంబుల్ స్ట్రిప్స్ కాలగమనంలో మందం తగ్గి సాధారణంగా మారనున్నాయి.

### రహదారుల భద్రతకు పెద్దపీట

ప్రమాదాల నివారణలో భాగంగా ఐఆర్‌సీ నిబంధనలను పక్కాగా పాటించనున్నారు. ప్రధానంగా ఎస్‌వోపీ ప్రకారం రోడ్ మార్కింగ్, సైనేజ్, రోడ్ కర్వ్ (మూల మలుపులు సూచించే బోర్డులు), జీబ్రా క్రాసింగ్‌లు, స్కూల్ జోన్స్, హాస్పిటల్ జోన్స్, సైకిల్ ట్రాక్‌లు, బస్ బేలు, ఆన్ స్ట్రీట్ పార్కింగ్, ఆఫ్ స్ట్రీట్ పార్కింగ్, ఏరియల్ రోడ్లు, రహదారులపై స్పీడ్ లిమిట్ , ఓవర్ టేకింగ్ సైన్ , పాదాచారుల క్రాసింగ్ సూచించే గుర్తులను కచ్చితంగా అమలు చేయనున్నారు. రహదారుల భద్రతకు పెద్దపీట వేయనున్నారు.

## టీటీడీ చైర్మన్‌తో ఎమ్మెల్సీ కవిత భేటీ

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడుతో ఎమ్మెల్సీ కవిత గురువారం భేటీ అయ్యారు. తెలంగాణలోని వివిధ బంజారా పీఠాధిపతులతో కలిసి ఆమె బోర్డు చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 30న హరితామ్ బావాజీ జయంతి సందర్భంగా బంజారా (సుగాలి, లంబాడీ) పీఠాధిపతులు, పూజారులకు.. మఠంలో ప్రత్యేకంగా పూజలు చేసే అవకాశం కల్పించడంతో పాటు నైవేద్యం సమర్పించడానికి ఏర్పాట్లు చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. స్పందించిన టీటీడీ చైర్మన్ నాయుడు.. హతిరామ్ బావాజీ పీఠం నిర్వాహకులు, గిరిజన పీఠాధిపతులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. అలాగే బావాజీ మఠంలో పూజలకు, హారతి ఇవ్వడానికి బోర్డు సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# తవ్వారు.. వదిలేశారు

- బల్దియాలో రోడ్ల తవ్వకాలపై నిషేధానికి తూట్లు
- అమలుకు నోచుకోని కమిషనర్ ఆదేశాలు
- రహదారుల రిస్టోరేషన్‌లో జాప్యం



బంజారాహిల్స్ రోడ్ నం.1లో రోడ్డు తవ్విన అనంతరం వ్యర్థాలను తొలగించని దృశ్యం

బంజారాహిల్స్, జూన్ 19: వర్షాకాలంలో రోడ్లను తవ్వడాన్ని నిషేధిస్తున్నాం.. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైన రోడ్లను తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటామంటూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఇచ్చిన ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. జీహెచ్ఎంసీ సర్కిల్–18లోని పలు ప్రాంతాల్లో జలమండలితో పాటు ఇతర ప్రభుత్వ విభాగాలు జూన్ నెలలో సైతం రోడ్లను యథేచ్ఛగా తవ్వుతూ పనులు చేస్తున్నాయి. దీంతో ప్రధాన రోడ్లతో పాటు కాలనీ రోడ్లపై వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తవ్విన రోడ్లను రిస్టోరేషన్ చేసినా వ్యర్థాలను తొలగించడంలో విపరీతమైన జాప్యం చేస్తున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వర కాలనీ డివిజన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మే 25 తర్వాత కూడా రోడ్ల తవ్వకాలు కొనసాగిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పనులను బల్దియా అధికారులు ఆపేసినా రోడ్ల రిస్టోరేషన్‌ను వేగవంతం చేయకపోవడంతో వర్షపునీటితో ప్రమాదం పొంచి ఉంది.

### రిస్టోరేషన్ పనులు చేయకపోవడంతో..

బంజారాహిల్స్ రోడ్ నం 14లో శబ్దాలయ వెనకాలనుంచి జూడియో స్టోర్ దాకా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో వరదనీటి లైన్ పనులు చేపట్టారు. నిర్దేశిత గడువులో రోడ్డు రిస్టోరేషన్ పనులు చేయకపోవడంతో రోడ్డుపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. బంజారాహిల్స్ రోడ్ నం. 13నుంచి బంజారాహిల్స్ రోడ్ నం.1లో కొత్తగా నిర్మిస్తున్న కార్పొరేట్ ఆస్పత్రికి సంబంధించిన అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్ కోసం జీహెచ్ఎంసీ నుంచి రోడ్డు కటింగ్ అనుమతి తీసుకుని పనులు పూర్తిచేశారు. అయితే పదిహేనురోజుల క్రితమే రిస్టోరేషన్ పనులు పూర్తయినా డెబ్రీస్ తొలగించకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

### ట్రాఫిక్‌జామ్‌తో ఇక్కట్లు..

బంజారాహిల్స్ రోడ్ నం.14 నుంచి శబ్దాలయ స్టూడియోస్, కేబీఆర్ పార్కు చౌరస్తా మీదుగా జలమండలి ఆధ్వర్యంలో మంచినీటి లైన్ కోసం జూన్ 10 నుంచి రోడ్డును తవ్వేసి పనులు చేశారు. వారం రోజులు గడిచినా రోడ్డు రిస్టోరేషన్ పనులు పూర్తిచేయకపోవడంతో అత్యంత రద్దీ చౌరస్తాలో సమస్యలు తలెత్తాయి. బంజారాహిల్స్ రోడ్ నం 14లోని రాఘవేంద్ర కన్‌స్ట్రక్షన్స్ నుంచి జూడియో స్టోర్ దాకా మంచినీటి లైన్ కోసం ప్రత్యేకంగా లైన్ పనులు చేపట్టారు. అయితే వర్షాకాలంలో రోడ్డు కటింగ్ నిషేధించిన తర్వాత పనులు ప్రారంభించడంతో 10 రోజుల క్రితం జీహెచ్ఎంసీ అధికారులు పనులు నిలిపివేయడంతో రోడ్డు మొత్తం గతుకులమయంగా మారింది. ఆగస్టు దాకా రోడ్డును తవ్వే అవకాశం లేకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారయ్యే అవకాశం ఉంది.



కుబా కాలనీ వాసులతో ఎమ్మెల్యే సబితారెడ్డి

# ఎలా కూల్చివేస్తారో చూస్తా

- ఇండ్ల కూల్చివేతలపై అత్యుత్సాహం ఎందుకు
- హైడ్రా అధికారుల తీరుపై ఎమ్మెల్యే సబితారెడ్డి ఫైర్
- కుబా కాలనీలో పేదల ఇళ్లకు నోటీసులు ఇవ్వడంపై ఆగ్రహం

బడంగ్ పేట్, జూన్ 19: రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేదల ఇండ్లను కూల్చివేస్తామని హైడ్రా అధికారులు అత్యుత్సాహం ఎందుకు చూపుతున్నారో అర్థం కావడం లేదని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. పేదలకు నోటీసులు జారీ చేసి భయభ్రాంతులకు గురిచేయడం మంచి పద్ధతి కాదని ఆమె అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మునిసిపాలిటీ పరిధిలోని కుబా కాలనీలో గురువారం ఎమ్మెల్యే పర్యటించారు. హైడ్రా అధికారులు తమ ఇండ్లు కూల్చివేస్తామని నోటీసులు ఇచ్చారని కాలనీవాసులు ఎమ్మెల్యే ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. ఇళ్లు కూల్చివేస్తే ఎక్కడ ఉండాలో అర్థం కావడంలేదని కన్నీటి పర్యంతమయ్యారు.

### బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది..

సబితారెడ్డి మాట్లాడుతూ.. నిరుపేదల ఇళ్లు ఎలా కూల్చివేస్తారో చూస్తాం.. ఎవరూ భయపడవద్దని భరోసానిచ్చారు. పేదలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. బడాబాబులను వదిలేసి పైసా పైసా కూడా పెట్టి పేదలు కట్టుకున్న ఇండ్లపైన హైడ్రా అధికారుల జులుం ఏందన్నారు. మొదట చెరువుల ప్రాంతాలలో కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కుబా కాలనీలో ఉన్న పేదల ఇండ్ల జోలికి ఎవరు పోకుండా చర్యలు తీసుకోవాలని బాలాపూర్ తహసీల్దార్‌కు ఎమ్మెల్యే సబితారెడ్డి ఫోన్లో సూచించారు. నిరుపేదల జోలికి వస్తే సహించేది లేదన్నారు. తదనంతరం మున్సిపాలిటీ పరిధిలోని 28వ డివిజన్‌లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకట్‌రామ్, మాజీ సర్పంచ్ సూరెడ్డి కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు

# నగరంలో డెంగీ కలకలం

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.

### ముందస్తు చర్యలేవి..?

దోమలు వృద్ధిచెందకుండా ఉండేందుకు యాంటీలార్వా, ఫాగింగ్ తదితర చర్యలు చేపట్టాలి. అంతే కాకుండా బస్తీలు, కాలనీలు, ముఖ్యంగా మురికి వాడల్లో కాలువలు, కుంటలు, నాలాల్లో దోమలు వృద్ధి చెందకుండా నివారణ చర్యలు చేపట్టాలి. కానీ సంబంధిత జీహెచ్ఎంసీ, ఎంటమాలజి విభాగం అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. వర్షాలు కురవడంతో దీని వల్ల దోమలు వృద్ధిచెంది సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశాలు లేకపోలేదని వాపోతున్నారు వైద్యులు. మూడురోజులైనా జ్వరం, ఒంటి నొప్పులు వంటి లక్షణాలు తగ్గకపోతే వెంటనే వైద్యులను సంప్రదించి, సంబంధిత వైద్యపరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అంతే కాకుండా దోమల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంటితో పాటు ఇంటి పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించాలని సూచిస్తున్నారు.



## హై-లైఫ్ ఎగ్జిబిషన్ గ్రాండ్ లాంచ్

నగరంలోని హైటెక్ సిటీ ప్రాంతంలో ఉన్న హెచ్ఐసీసీలో 'హై-లైఫ్ ఎగ్జిబిషన్' గురువారం ఘనంగా ప్రారంభమైంది. దేశంలోనే అతిపెద్ద ఫ్యాషన్, లగ్జరీ, లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్‌గా పేరొందిన ఈ కార్యక్రమం ఈనెల 19, 20, 21 తేదీల్లో జరగనుంది. ఎగ్జిబిషన్‌లో ఉత్తమమైన ఫ్యాషన్‌లు, జీవనశైలి ఉత్పత్తుల ప్రదర్శనలు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీనటి సీరత్ కపూర్, శ్రవంతి చౌకారపు, మిస్ యూనివర్స్ మహారాష్ట్ర–2025 టైటిల్ విజేత అండలీబ్ జైదీ తదితరులు పాల్గొన్నారు.

– సిటీబ్యూరో, జూన్ 19, (నమస్తే తెలంగాణ):

# విద్యార్థుల భద్రత..మన బాధ్యత

(మొదటిపేజీ తరువాయి)

బాధ్యతగా స్వీకరించాలన్నారు. నేటి పిల్లలే రేపటి భవిష్యత్తుకు పునాదులని, పాఠశాల నిర్వాహకులు ఫిట్‌నెస్ ఉన్న వాహనాలను మాత్రమే నడపాలని, డ్రైవర్లకు రోడ్డు నిబంధనలు తప్పక తెలిసి ఉండాలని సూచించారు. ప్రతి బస్సులో అటెండెంట్ తో పాటు పాఠశాలలో సెక్యూరిటీ గార్డులు ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 9,10వ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. పిల్లలు పాఠశాలలకు వెళ్లే సమయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల యజమాన్యం ప్రత్యేక బాధ్యత, శ్రద్ధ చూపాలని అన్నారు. పిల్లలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని, ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ హైదరాబాద్ జిల్లాలో పటిష్ట చర్యలు చేపట్టిందని వెల్లడించారు. బస్సులపై పాఠశాల, కళాశాల నిర్వాహకుల ఫోన్ నెంబర్లు తప్పక ఉండాలని, ఎమర్జెన్సీ ఎగ్జిట్ డోర్ మీద పేరు తప్పకుండా రాయాలన్నారు. రవాణా, విద్యాశాఖ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో ప్రమాదాలకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. తప్పనిసరిగా భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్ట్ జాయింట్ కమిషనర్ రమేశ్, స్కూల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్ లింగయ్య, ఆర్టీసీ ఈడీ రాజశేఖర్, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, డీఈవో రోహిణి, ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ట్రాఫిక్ జోయెల్ డేవీస్, కంటోన్మెంట్ బోర్డ్ సీఈఓ మధుకర్ నాయక్ పాల్గొన్నారు.

# స్కూల్ బస్సులు.. ఎంత సేఫ్!

(మొదటిపేజీ తరువాయి)

రంగులు, అక్షరాలు తదితర అన్నీ అంశాలపై సూచనలు ఇస్తారు. కానీ ఈ సారి ఆర్టీఏ అధికారులు వారికి సూచనలు చేసినప్పటికీ విద్యా సంస్థల నిర్వాహకులు తమదారి తమదే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. రోజువారి కూలీగా డ్రైవర్లను నియమించుకుని ఎటువంటి అనుభవం లేకున్నా చేతికి స్కూల్ బస్సును ఇచ్చేస్తున్నారు. ఆ బస్సును నడపడానికి వాళ్లంతా మద్యం తాగి రోడ్డుపై ఉరికిస్తున్నారు. ఇలా పోలీసుల తనిఖీల్లో పట్టుబడుతున్నారు. ఇప్పటి వరకు 3వేల విద్యా సంస్థల బస్సులు అసలు ఫిట్‌నెస్ పరీక్షకే రాలేదని అధికారులు చెబుతుండటం ఆందోళన కలిగిస్తుంది.

### ఇవి పాటించాల్సిందే..!

**మోటార్ వాహనాల చట్టం ప్రకారం స్కూల్ బస్సు తప్పక పాటించాల్సి న నియమాలు**

- రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్(ఆర్‌సీ), వ్యాలిడ్ ఇన్సూరెన్స్ సర్టిఫికెట్, వ్యాలిడ్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, ట్యాక్స్ పేమెంట్ రశీదు, పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్, డ్రైవింగ్ చేసే డ్రైవర్ లైసెన్సు తప్పక వాహనంతో ఉండాలి.
- ప్రభుత్వ సూచనల మేరకు ఐదు రకాల వాహనాల వేగానికి కళ్లెం వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటిలో విద్యా సంస్థల బస్సులు కూడా ఉన్నాయి. ఫిటెనెస్‌కు ముందే ఆయా వాహనాల్లో వేగ నియంత్రణ పరికరాలు ఉండేలా చూడాల్సి ఉంటుంది.
- తెలంగాణ మోటార్ వెహికల్ రూల్స్ 1989 ప్రకారం రూల్‌నంబర్ 186జీ ప్రకారం తెలంగాణలో విద్యాసంస్థల బస్సులు పూర్తి పసుపు రంగులో ఉండాలి. ఆ బస్సుపై పెద్ద అక్షరాలతో స్కూల్ బస్సు అని రాయడం తప్పనిసరి.
- వాహనం డ్రైవర్ 60 సంవత్సరాలకు మించి ఉండరాదు. డ్రైవర్‌కు సంబంధించిన ఆరోగ్య వివరాలు బస్సులో అతికించాలి.
- కనీసం ఐదు సంవత్సరాలు డ్రైవింగ్ అనుభవం ఉండాలి.
- వాహనంలో ఫిర్యాదుల పట్టికను ఏర్పాటు చేసి ఫిర్యాదులను ప్రతి నెలకు ఒకసారి పరిశీలించాలి.
- ప్రతి వాహనంలో అత్యవసర ద్వారం పెట్టాలి. పెద్ద అక్షరాలతో రాయించాలి. వాహనంలో ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలి.
- ప్రతి బస్సులో విద్యార్థుల పేర్లు, ఇంటి చిరునామా, తరగతులు, దిగాల్సిన ప్రదేశం పేర్ల పట్టికతో పాటు రూట్ మ్యాప్ తప్పని సరి.
- విద్యార్థులు బస్సును ఎక్కడం, దిగడం విషయాన్ని గ్రహించేందుకు కన్వెక్స్ క్రాస్ అద్దాలుండాలి. ప్రతి బస్సులో కూర్చున్న విద్యార్థులు డ్రైవర్‌కు కన్పించేలా పెద్ద అద్దం పెట్టాలి.
- బస్సులు సీట్ల కింద విద్యార్థుల బ్యాగులు పెట్టునేందుకు అరలు ఏర్పాటు చేయాలి
- రవాణా శాఖ ఇచ్చే శిక్షణలో డ్రైవర్ పాల్గొనాల్సి ఉంటుంది. సంవత్సరానికి ఒకసారి విద్యార్థులతో రోడ్ సేఫ్టీ డేను నిర్వహించాలి.

# ప్రభుత్వ పాఠశాలలో వసతులు కల్పించండి

ఎమ్మెల్యే మర్రికి అల్వాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల వినతి



అల్వాల్ జూన్ 19: సరస్వతీ నిలయాలుగా ఉండాల్సిన సర్కార్ బడులు సమస్యలకు నిలయంగా మారాయని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. అల్వాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు, సీసీ కెమెరాల ఏర్పాటు, అదనపు తరగతి గదులు నిర్మాణం చేపట్టాలని.. అలాగే టీచర్ల కొరత పాఠశాలను తీవ్రంగా వేధిస్తోందని తక్షణమే టీచర్లను నియమించాలని కోరుతూ గురువారం ఆ పాఠశాల ఉపాధ్యాయులు ఎమ్మెల్యే మర్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. సంబంధిత విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా కృషిచేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయుడు వెంకటయ్య, ఉపాధ్యాయురాలు సబిత, సంగీత తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతికతతో ప్రపంచ దేశాలపై ఆధిపత్యం

బొల్లారం, జూన్ 19: దేశ రక్షణ వ్యవస్థలో సాంకేతికంగా నైపుణ్యం కలిగి వ్యూహాత్మకంగా అవగాహన ఉన్న అధికారులను పెంపొందించడంలో మిలిటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్ (ఎంసీఈఎంఈ) కీలక పాత్ర పోషిస్తుందని ఎంసీఈఎంఈ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్శనే అన్నారు. గురువారం తిరుమలగిరిలోని మిలిటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్ (ఏంసీఈఎంఈ) 107వ స్నాతకోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ (ఐఐఎం) డైరెక్టర్ హిమాన్షు రాయ్, ఎంసీఈఎంఈ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్శనే హాజరయ్యారు. ఈ వేడుకల్లో బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ డిగ్రీ టెక్నికల్ ఎంట్రీ స్కీం కోర్సు(టీఈఎస్–43)లో శిక్షణ పూర్తిచేసుకున్న 20 మంది అధికారులకు డిగ్రీ పట్టాలను అందజేశారు.



యూఎస్ కాన్సులేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వామపక్ష నేతలు

# ఇజ్రాయెల్ -ఇరాన్ యుద్ధాన్ని నిలిపివేయాలి

- యూఎస్ కాన్సులేట్ ఎదుట వామపక్షాల ధర్నా
- ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఉద్రిక్తత
- నేతల అరెస్టు, నార్సింగి పీఎస్‌కు తరలింపు

శేరిలింగంపల్లి, జూన్ 19: నానకరామ్ గూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లో యూఎస్ కాన్సులేట్ వద్ద వివిధ వామపక్ష పార్టీల నేతల ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. ఇరాన్ పై ఇజ్రాయిల్ యుద్ధ వైఖరిని ఖండిస్తూ వామపక్ష పార్టీల నేతలు ప్లకార్డులు చేత పట్టుకొని కాన్సులేట్ వద్ద ఆందోళనకి దిగారు. ఇజ్రాయిల్ మారణ హోమ యుద్ధాన్ని తక్షణమే ఆపాలంటూ డిమాండ్ చేస్తూ నినాదాలు ఇస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. యుద్ధం వలన సామాన్య పౌరులు ఇబ్బందులు పడతారని.. వెంటనే ఇరుదేశాలు శాంతిచర్చలు జరపడంతో పాటు యుద్ధాన్ని ముగించాల్సిన అవసరం ఉందన్నారు. యుద్ధం వద్దు అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. కాన్సులేట్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు భారీ కేర్లు అడ్డుగా పెట్టి నిరసనకారులను అడ్డుకున్నారు. ఎక్కడికక్కడ వామపక్ష పార్టీల నేతలనుఆందోళనకారులను చెదరగొట్టి వ్యాన్లలో ఎక్కించి నార్సింగ్ పోలీస్ స్టేషన్ల కు తరలించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, వామపక్ష పార్టీల నేతలు నర్సింహా, జంగయ్య, నర్సింహా రెడ్డి తదితర నేతలు, కార్యకర్తలు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మహిళా సాధికారతతోనే ఆర్థిక ప్రగతి

కలెక్టర్ హరిచందన దాసరి

సిటీ బ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ): గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా పారిశ్రామికవేత్తల సాధికారత.. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. టైర్–2, టైర్–3 ప్రాంతాల్లోని మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో వీహబ్‌లో గురువారం చేపట్టిన 'వీ రీచ్' కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల్లో వ్యాపార సామర్థ్యాన్ని వెలికితీయడం, ప్రోత్సహించడమే లక్ష్యంగా 120 మంది మహిళా పారిశ్రామికవేత్తలను రెండు బ్యాచ్‌లుగా ఏర్పాటు చేశారని చెప్పారు. వీహబ్ ఫౌండేషన్ సీఈవో సీత మాట్లాడుతూ.. బిజినెస్ నైపుణ్యాలు పెంపొందించుకోవాలనుకున్న మహిళలు వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకుని వ్యాపార యూనిట్లను ప్రారంభించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 93921 84664 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## కాంగ్రెస్ కార్పొరేటర్ దౌర్జన్యం

(మొదటిపేజీ తరువాయి)

కార్పొరేటర్, అతని అనుచరుల ఆగడాలపై ఇప్పటికే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఉద్యోగులు సదరు వ్యక్తులతో ప్రాణహాని ఉందని.. వారి నుంచి రక్షణ కల్పించాలని.. వెంటనే వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం శేరిలింగంపల్లిలోని జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడేకు వినతి పత్రం అందచేశారు.

### ఏఎంసీ బాలరాజ్‌కు సంఘీభావం...

రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, అతని అనుచరులు దాడి చేసిన ఘటనలో జీహెచ్ఎంసీ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ బాలరాజ్‌కు బల్దియా ఉద్యోగ, కార్మిక సంఘాలు సంఘీభావం తెలపడంతో పాటు స్థానికంగా పార్టీలకతీతంగా మద్దతు ప్రకటిస్తున్నారు. ఉద్యోగులు నిర్వహించిన ధర్నాలో ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్, మజ్దూర్ యూనియన్ నాయకులు, రెవెన్యూ, ఎస్సీఎస్టీ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఎంసీ బాలరాజ్‌పై దాడి ఘటనను తీవ్రంగా ఖండించారు. ఐఎన్‌టీయూసీ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్, ఇతర సంఘ సభ్యులు పాల్గొన్నారు. అలాగే.. రహ్మత్‌నగర్ ప్రజలు స్వచ్ఛందంగా ఏఎంసీ బాలరాజ్‌కు మద్దతు తెలిపారు. నగర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, కాంటెస్టెడ్ కార్పొరేటర్ బండపల్లి భవానీశంకర్ ఏఎంసీ బాలరాజ్‌ను కలిసి సంఘీభావం తెలిపారు.



దుర్గంచెరువును పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ కర్ణన్

# డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

### జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

సిటీ బ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ):దుర్గం చెరువు డ్రైనేజీ సమస్యను సత్వరమే పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన దుర్గంచెరువును పరిశీలించారు. మురుగునీటి పైప్‌లైన్ మళ్లింపు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. సివరేజ్ లైన్ స్వతహాగా నిర్వహించి వాకర్స్‌కు ఇబ్బందులు లేకుండా జలమండలి చర్యలు తీసుకోవాలన్నారు. చెరువును మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు పార్కులో వస్తువులను సమీకరించాలని సీఎస్ఆర్ నిర్వహిస్తున్న వారికి సూచించారు. అక్కడ ఉన్న ఎస్టీపీ సందర్శించి శుద్ధి వ్యవస్థను అడిగి తెలుసుకున్నారు. థర్డ్ పార్టీతో పాటు నీరి సంస్థ ద్వారా శుద్ధి చేసిన నీటిని పరీక్షించాలని జలమండలి అధికారులను ఆదేశించారు. ఎస్ఎన్‌డీపీ ద్వారా చేపడుతున్న స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ పనులను పరిశీలించి సెప్టెంబర్ నాటికి పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.కమిషనర్ వెంట శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ సహదేవ్ కేశవ్ పాటిల్, ఎస్ఎన్‌డీపీ సీఈ కోటేశ్వర రావు, జలమండలి అధికారులు, లేక్స్ ఈఈ నారాయణ, డిప్యూటీ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

### వీధిలైట్ల సమస్యలపై దృష్టి పెట్టాలి

వీధి లైట్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. గతంలో చేపట్టిన నాలా పూడికతీత పనుల్లో ఆశించిన ప్రగతి లేనందున.. హైడ్రా సమన్వయంతో మరోమారు పరిశీలించి పూడికతీత పనులు చేపట్టాలని జోనల్ కమిషనర్లను కర్ణన్ కమిషనర్ ఆదేశించారు. గురువారం.. అడిషనల్, జోనల్ కమిషనర్లు, హెచ్ఓడీలతో డీసిల్టింగ్, శానిటేషన్, స్ట్రీట్ లైట్, దోమల నివారణ, ట్యాక్స్ వసూళ్లపై కమిషనర్ సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్ట్రీట్ లైట్ సమస్యలపై తరచుగా ఎక్కువ ఫిర్యాదులు వస్తున్న ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారం పై దృష్టి సారించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్‌పై చర్యలు తీసుకోవాలని సూచించారు. లక్ష్యం మేరకు ట్యాక్స్ వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు.